## చేపలు పట్టేందుకు వెళ్లి బాలుడి మృతి

పొతంగల్, ఫిబ్రవరి 13 : చేపలు పట్టేందుకు వెళ్లి బాలుడు మృతిచెందిన ఘటన పొతంగల్ మండలంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పొతంగల్ గ్రామానికి చెందిన సాయిరాం (16) బుధవారం మధ్యాహ్నం చేపలు పట్టడానికి స్థానిక మంజీరా నదికి వెళ్లాడు. రాత్రయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెతికారు. నది వద్ద అతడి బట్టలు, చెప్పులు గుర్తించి, పోలీస్‌స్టేషన్‌లో రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు గురువారం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా దవాఖానకు తరలించారు.

## పొలంలో కాలుజారి మరొకరు..

పొతంగల్, ఫిబ్రవరి 13 : పొలంలో మందు చల్లేందుకు వెళ్లి కాలు జారి కిందపడడంతో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని హెగ్డోలీ గ్రామంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోన్‌కాంబ్లే రమేశ్ (35) గురువారం ఉదయం పొలంలో మందు చల్లేందుకు వెళ్లాడు. చాలా సమయం కావస్తున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలానికి వెళ్లి చూడగా బురదలో కూరుకుపోయి అప్పటికే మృతిచెందాడు. ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతిచెందినట్లు మృతుడి భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

## కీటకజనిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 13 : జిల్లాలో కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లు, నోడల్ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఫ్రైడే – డ్రైడే నిర్వహించి, నిల్వ నీటిని తొలగించాలని, కీటక జనిత వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో కీటక జనీత వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, అసిస్టెంట్ మలేరియా అధికారి అబ్దుల్ సలీం, వివిధ మండలాల వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## బేటీ బచావో - బేటీ పడావోపై అవగాహన

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13 : మండలం రాంపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో మహిళా, శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా బాలల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో – బేటీ పడావోపై గురువారం అవగాహన కల్పించారు. జిల్లా సంక్షేమాధికారిణి రసూల్ బీ మాట్లాడుతూ.. బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమం పదేండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆడపిల్లల సంఖ్య తగ్గడానికి గల కారణాలు, బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలు ఉన్నత చదువులు చదవాలని, అన్ని కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్లు మమత, బుజ్జి, భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ గోవర్ధన్, పోషణ అభియాన్ కో–ఆర్డినేటర్ రంజిత్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

**అదనపు కలెక్టర్ అంకిత్**

కంఠేశ్వర్, ఫిబ్రవరి 13 : జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన పోలింగ్‌స్టేషన్ల ముసాయిదా జాబితాను పరిశీలించి, మార్పులు చేర్పులు అవసరమైతే సూచనలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ రాజకీయ పార్టీల నాయకులను కోరారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశమై మాట్లాడారు. ఈనెల 11న జిల్లాలోని 31 మండలాలు, పరిధిలోని అన్ని గ్రామపంచాయతీల్లో ముసాయిదా జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. 31 మండలాల పరిధిలో 307 ఎంపీటీసీ స్థానాలున్నాయని, 8,51,770 మంది ఓటర్లున్నారని తెలిపారు. ఈ మేరకు మొత్తం 1,564 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిలో 400లోపు ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 122 ఉండగా, 500 లోపు ఓటర్లతో కూడిన పోలింగ్ కేంద్రాలు 362 ఉన్నాయని, 750 వరకు ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 1080 ఉన్నాయని వివరించారు. కొత్తగా ఏర్పాటైన మండలాలను కలుపుకొని మొత్తం 31 మండలాలకు ఒక్కో మండలం వారీగా ఎన్ని ఎంపీటీసీ స్థానాలు, ఎంతమంది ఓటర్లున్నారు, అందుకు సరిపోయేలా ఎన్ని పోలింగ్ కేంద్రాలను గుర్తించారనే వివరాలను తెలిపారు. అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లోనూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవోలు సమావేశాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. అభ్యంతరాలు వస్తే, వాటిని పరిష్కరించి పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సాయాగౌడ్, డిప్యూటీ సీఈవో సాయన్న, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 13 : పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ హెచ్చరించారు. పలు డివిజన్లలో గురువారం తెల్లవారుజామున తనిఖీలు చేపట్టారు. మురుగునీటి కాలువలు, పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. ఉదయం సకాలంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది విధులకు హాజరుకాకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 'భీమా కోరేగావ్' కేసు కొట్టివేత

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 13 : భీమా కోరేగావ్ అమరులకు నివాళిగా నిర్వహించిన ర్యాలీ కేసును కొట్టివేస్తూ నిజామాబాద్ మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ (జూనియర్ సివిల్ జడ్జి) కుష్బూ ఉపాధ్యాయ్ గురువారం తీర్పు వెల్లడించారు. మహారాష్ట్రలోని భీమా కోరేగావ్ అమరుల దినోత్సవం సందర్భంగా 1 జనవరి, 2018న నిజామాబాద్ నగరంలోని దళిత సంఘాలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించాయి. ర్యాలీకి పోలీసుల అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీ నిర్వహించారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో కేసు నమోదైంది. కోర్టు నేర న్యాయ విచారణలో ఆరోపణలు నిరూపణ కాకపోవడంతో ప్రధాన ముద్దాయి చక్రే దౌలత్, దండి వెంకట్, రామారావు కాంబ్లే, సంజీవ్ ససనే, మధు కాంబ్లే, నవీన్ గాన్ద్రే, సబ్బని లతను నిర్దోషులుగా విడుదల చేస్తూ తీర్పు చెప్పారు.

## కేంద్ర బడ్జెట్‌తో సంపన్నవర్గాలకే ప్రయోజనం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



సమావేశంలో మాట్లాడుతున్న పశ్య పద్మ

కంఠేశ్వర్/ ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 13 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025–26 కేవలం సంపన్నవర్గాలకే ప్రయోజనం చేకూర్చేలా ఉన్నదని, బడ్జెట్‌ను సవరించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో ఉన్న హమాలీ యూనియన్ కార్యాలయంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు, కార్మికులు, నిరుపేదలకు వ్యతిరేకంగా ఈ బడ్జెట్ ఉన్నదని విమర్శించారు. రైతులు డిమాండ్ చేస్తున్న పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేసి, అమలుకు నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజల అభివృద్ధికి తగినట్లు బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. సమావేశంలో నాయకులు సుధాకర్, భూమయ్య, దశరథ్, ఓమయ్య, రాజేశ్వర్, రాజిరెడ్డి, ముత్యాలు, రఘురాం, అంజలి పాల్గొన్నారు.

# బకాయిలు విడుదల చేయకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తాం



బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్

**బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్**

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 13 : పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 10 రోజుల్లో విడుదల చేయాలని, లేకపోతే విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడంతోపాటు సచివాలయాన్ని ముట్టడిస్తామని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ హెచ్చరించారు. జిల్లాకేంద్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.4,650 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రంలో పేద బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు ఫీజులు కట్టలేక ఒత్తిడితో చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొన్నదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లో పూర్తి ఫీజులు చెల్లిస్తామని, బీసీ విద్యార్థులకు షరతులు లేని విద్యనందిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా విద్యార్థులకు ఒక్క రూపాయి విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఇంటర్, డిగ్రీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యాసంస్థలు నడుపలేక, అప్పులకు వడ్డీలు కట్టలేని పరిస్థితిలో కాలేజీలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూస ఆంజనేయులు, కొయ్యాడ శంకర్, సంతోష్‌కుమార్, బసవరాజు, రవీందర్ పాల్గొన్నారు.

## టీయూలో నానో టెక్నాలజీపై సెమినార్



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ గంగరాజు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13 : టీయూలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బి.సాయిలు అధ్యక్షతన రీసెంట్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ నానో టెక్నాలజీ అండ్ బయో మెడికల్ రీసెర్చ్ అంశంపై గురువారం సమావేశం నిర్వహించారు. దక్షిణ కొరియాకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ గంగరాజు నానో టెక్నాలజీపై ప్రసంగించారు. కాల్యుష రహిత ప్లాస్టిక్స్‌ను నానో కణాలు ఉపయోగించి తయారు చేయవచ్చని తెలిపారు. స్కానింగ్స్, ఔషధాల్లో నానో కణాలపై వివరించారు. కార్యక్రమంలో వైద్యులు రీసెర్చ్ స్కాలర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో సాయాగౌడ్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 13 : మహిళలకు ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి అని డీఆర్డీవో సాయాగౌడ్ అన్నారు. కలెక్టరేట్‌లో అన్ని మండలాలకు చెందిన సమాఖ్య అధ్యక్షురాళ్లకు ఆరోగ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 10 ఆరోగ్య అంశాలపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. డీపీఎం సాయిలు, శ్రీనివాస్ ఏపీఎంలు సరోజిని, గంగాధర్, రాజేందర్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## రక్తపు మడుగులో వ్యక్తి

- కత్తితో దాడిచేసినట్లు అనుమానాలు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 13 : జిల్లాకేంద్రంలోని కుమార్‌గల్లీ ప్రాంతంలో ఉన్న ఓ భవనం ఎదుట గుర్తుతెలియని వ్యక్తి రక్తపు మడుగులో ఉండడం కలకలం సృష్టించింది. వన్‌టౌన్ ఎస్సై–2 బాబురావు కథనం ప్రకారం.. నగరంలోని కుమార్ గలీలో ఓ భవనంలోకి బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఓ వ్యక్తి వెళ్లేందుకు యత్నించాడు. గమనించిన వాచ్‌మన్ అక్కడినుంచి వెళ్లగొట్టాడు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఆ భవనం ఎదుట కడుపులో నుంచి రక్తం కారుతూ స్పృహలేకుండా పడి ఉండడాన్ని భవనంలో ఉండే వ్యక్తులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై–2 బాబూరావు, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని, క్షతగాత్రుడిని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సదరు వ్యక్తి సాయినగర్ రోడ్డు నంబర్–1కు చెందిన లక్ష్మణ్‌గా తెలిసిందని వెల్లడించారు. పదునైన ఆయుధంతో కడుపులో పొడిచిన ఆనవాళ్లు ఉన్నట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. లక్ష్మణ్ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై–2 తెలిపారు.

## బైక్ చోరీ చేసేందుకు వచ్చి గొలుసు చోరీ

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 13 : బైక్‌ను చోరీ చేసేందుకు వచ్చి విఫలం కావడంతో ఇంట్లో ఒంటరిగా కూర్చున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును చోరీ చేసిన ఘటన జిల్లాకేంద్రంలోని వీక్లీమార్కెట్ ప్రాంతంలో గురువారం సాయంత్రం చోటు చేసుకున్నది. వన్‌టౌన్ ఎస్సై మొగులయ్య కథనం ప్రకారం.. వీక్లీమార్కెట్ ప్రాంతంలో మూడు బైకుల తాళాలు తెరిచేందుకు ఓ యువకుడు యత్నించి విఫలమయ్యాడు. సమీపంలోని ఓ ఇంట్లో మంచంపై విజయ అనే వృద్ధురాలు ఒంటరిగా కూర్చొని ఉండడం గమనించి, ఆమె మెడలో నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసును తెంచాడు. వృద్ధురాలు గట్టిగా అరవడంతో ఆమె చేయి కొరికి అక్కడి నుంచి పర్యారయ్యాడు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వన్‌టౌన్ ఎస్సై మొగులయ్య ఘటనా స్థలానికి చేరుకొని, బాధితురాలితో మాట్లాడారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు.

## సంక్షిప్తంగా..

- **సంతాపసభ పోస్టర్ల ఆవిష్కరణ -** డిచ్‌పల్లి/ జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 13 : సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు యాదగిరి సంతాప సభ పోస్టర్లను డిచ్‌పల్లిలో డిచ్‌పల్లి మండల కార్యదర్శి మురళి ఆవిష్కరించారు. జక్రాన్‌పల్లిలో ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్ సంతాపసభ పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17న రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సంతాపసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.
- **ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిసోల్యూషన్‌పై బహిరంగ పరీక్ష -** డిచ్‌పల్లి, ఫిబ్రవరి 13 : టీయూలోని న్యాయ కళాశాలలో 5వ సెమిస్టర్ విద్యార్థులకు కోర్సులో భాగంగా ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిసోల్యూషన్ అంశంపై గురువారం మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా జిల్లా న్యాయవాది రామాగౌడ్ హాజరయ్యారు. ఇంటర్నల్ ఎగ్జామినర్‌గా న్యాయశాస్త్ర విభాగ చైర్‌పర్సన్ డాక్టర్ బి.స్రవంతి వ్యవహరించారు.
- **ఇన్సూరెన్స్ చెక్కు అందజేత -** వర్ని (రుద్రూర్), ఫిబ్రవరి 13 : వర్ని మండలం తగిలేపల్లి గ్రామానికి చెందిన ఎర్ర ఎల్లయ్య కుటుంబీకులకు టాటా ఏఐఏ లైఫ్ ఇన్సురెన్స్ బీమా చెక్కును మేనేజర్.. స్థానిక ఎస్సై రమేశ్ చేతుల మీదుగా పోలీస్ స్టేషన్‌లో గురువారం అందజేశారు. తగిలేపల్లి గ్రామానికి చెందిన ఎర్రఎల్లయ్య రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందగా చెక్కు మంజూరైంది. టాటా ఏఐఏ నిజామాబాద్ బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.
- **దివ్యాంగుల పాఠశాలలో డ్రెస్సుల పంపిణీ -** జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 13 : మండలకేంద్రంలోని దివ్యాంగుల పాఠశాలలో కొలిప్యాక్ సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్ –సరోజ దంపతులు విద్యార్థులకు గురువారం డ్రెస్సులు పంపిణీ చేశారు. చింతలూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. తమ కుమారుడు సునిత్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా వీటిని పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.
- **కేజీబీవీలో స్టేషనరీ పంపిణీ-** కోటగిరి, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు, బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్నులు, వాటర్‌బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో ఎల్.శంకర్, కేజీబీవీ ఇన్‌చార్జి ప్రత్యేకాధికారిణి రూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **గుండారం పాఠశాలలో ఆంగ్ల దినోత్సవం -** సారంగాపూర్, ఫిబ్రవరి 13 : రూరల్ మండలంలోని గుండారం జడ్పీహెచ్‌ఎస్‌లో సరోజినీనాయుడు జయంతి సందర్భంగా జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, స్టోరీ టెల్లింగ్, కవితాపఠనం పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఇంగ్లిష్ టీచర్లు గిరిధర్, ఆరోగ్యరాజ్.. ఆంగ్ల భాషా ప్రాధాన్యతను వివరించారు. హెచ్ఎం అమర్‌నాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13: పట్టణంలోని ధోబిఘాట్ వద్ద గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.



*ఎడపల్లి మండలం జాన్కంపేట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఆలయ కమిటీ, గౌడ కులసుల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వీరులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఓ భక్తుడు భక్తులకు అన్నదానం చేశాడు. ఆలయ ఈవో గింజుపల్లి వేణు సౌకర్యాలను పర్యవేక్షించారు. శాంతి భద్రతలను ఎస్సై వంశీకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. – ఎడపల్లి, ఫిబ్రవరి 13*

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**PASSPORT MISSING**

★I, AMPALLY RAJA GOUD S/o. AMPALLY NARA GOUD, R/o. H.No. 3-12, Vill:Dharmora, Mdl.Morthad, Dist. Nizamabad. T.S., నా యొక్క పాస్‌పోర్ట్ నెం.**A2872028** గలది. తేది:15–01–2025 రోజున ధర్మోర నుండి మోర్తాడ్‌కు బైక్‌పై వెళ్ళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికినచో సం|| 8008112148.
**NTZ-338513**

**GOLD FINANCE**

★**మీ బంగారం మణప్పురం, ముత్తూట్,** మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
**NT-337308**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్ : 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# సుంకెట్‌లో రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

మోర్తాడ్/పొతంగల్, ఫిబ్రవరి 13: మోర్తాడ్ మండలంలోని సుంకెట్ గ్రామశివారులో ఉన్న వాగు నుంచి కొన్నిరోజులుగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. సుంకెట్ గ్రామం నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఏఎస్సై గోపాల్, కానిస్టేబుల్ వసంత్ పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. మండలంలోని ఏ వాగు నుంచైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పొతంగల్ మండలంలో..**

పొతంగల్ మండలంలోని మంజీరా నదిని తోడేస్తున్నారు. రాత్రి అయిందంటే ఇసుక ట్రాక్టర్ల మోత వినిపిస్తున్నది. కొడిచర్ల శివారులో వేర్వేరు చోట్ల సుమారు 48 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపులను అధికారులు గురువారం గుర్తించి సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై గతంలో ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ప్రత్యేక బృందం రంగంలోకి దిగడంతో కొంతమేరకు ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టారు. ఇంతకుముందు ఇక్కడి పనిచేసిన తహసీల్దార్ వెళ్లిపోవడంతో ప్రత్యేక బృందం అదృశ్యమైంది. దీంతో ఇసుకాసురులు మళ్లీ రెచ్చిపోయారు. ప్రతిరోజు ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిస్తూ వివిధ ప్రాంతాల్లో డంపు చేస్తున్నారు.

## జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు గోదావరి ఎంపిక



ఏర్గట్ల, ఫిబ్రవరి 13: మండలంలోని బట్టాపూర్ గ్రామానికి చెందిన మూడ్ గోదావరి జాతీయ స్థాయి సీనియర్ మహిళా కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆమె కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. గోదావరి గతంలో జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీల్లో పాల్గొన్నదని తెలిపారు. తెలంగాణ మహిళా కబడ్డీ జట్టుకు సారథ్యం వహించినట్లు పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 18 వరకు హర్యానా రాష్ట్రంలో నిర్వహించనున్న 71వ సీనియర్ నేషనల్ మహిళా కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఆమె ప్రస్తుతం నిజామాబాద్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన గోదావరిని కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు లింగయ్య, కార్యదర్శి గంగాధర్, సభ్యులు అభినందించారు.

## బాలికలను రక్షించుకోవాలి

మాక్లూర్(నందిపేట్), ఫిబ్రవరి 13 : బాలికలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు అన్నారు. నందిపేట్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంపై గురువారం అవగాహన కల్పించారు. చిన్నారులకు భారసాల నిర్వహించారు. సదస్సులో ఐసీడీఎస్ అధికారులు, ఐకెపి సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13: ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్ రావు ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు.

## ఆన్‌లైన్‌లో పంటల నమోదు

మోర్తాడ్, ఫిబ్రవరి 13: సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతున్నది. గురువారం పాలెం, దొన్కల్, సుంకెట్ గ్రామాల్లో వ్యవసాయక్షేత్రాలను సందర్శించి పంటల వివరాలను వ్యవసాయాధికారులు నమోదు చేశారు. ఏవో హరీశ్ మాట్లాడుతూ...పంటలనమోదు కోసం వస్తున్న అధికారులకు రైతులు సహకరించాలని కోరారు.

## సభను విజయవంతం చేయాలి

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 13: జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించనున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యాదగిరి సంతాప సభను విజయవంతం చేయాలని ఆపార్టీ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్ కోరారు. గురువారం బోధన్ పట్టణంలోని హెడ్‌పోస్టాఫీస్ వద్ద సంతా సభ పోస్టర్లను గురువారం ఆయన పలువురు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పడాల శంకర్, సాయిలు, గంగాధర్, పోశెట్టి, శంకర్, భూమయ్య, రాములు, బాలయ్య, చిన్న పోశెట్టి ఉన్నారు.

## మంత్రాల నెపంతో మహిళపై దాడి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 13: మంత్రాలు చేస్తున్నదని ఓ మహిళపై కొందరు దాడి చేసిన ఘటన బోధన్ మండలం లంగ్డాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లవ్వ మంత్రాలు చేస్తున్నదని కొందరు వ్యక్తులు ఆమెపై భూతులు తిడుతూ చేతులతో దాడి చేశారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# ప్రయాగ్‌రాజ్ వెళ్తూ అనంతలోకాలకు

- లారీ, కారు ఢీకొని హైదరాబాద్‌కు చెందిన ఒకరు మృతి
- మరో ఐదుగురికి గాయాలు



లారీ వెనుక ఇరుక్కున్న కారు

బాల్కొండ, ఫిబ్రవరి 13: హైదరాబాద్‌లోని చింతల్ నుంచి ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు వెళ్తూ చిట్టాపూర్ 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వనం సంపత్‌రాణా (26) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఐదుగురు గాయాల పాలయ్యారు. ఈ సంఘటనకు సంబంధించి ఇన్‌చార్జి ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతల్‌కు చెందిన పోతు రమేశ్, చంద్రశేఖర్‌చారి, వనంత శ్రీనివాస్, రజనీకాంత్, పోత సాయి విశాల్, వనం సంపత్ రాణా హోండా బీఆర్వి కారులో యూపీలోని ప్రయాగ్‌రాజ్‌కు బయల్దేరారు. గురువారం తెల్లవారు జామున బాల్కొండ మండలం చిట్టాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద కారు ప్రమాదానికి గురైంది. మహారాష్ట్రకు చెందిన లారీ వేగంగా వచ్చి ఓవర్‌టేక్ చేస్తుండగా కారు లారీ వెనక ఇరుక్కుంది. దీంతో సంపత్ రాణా అక్కడికక్కడే మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆర్మూర్ దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ కిషన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13: స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజిని నాయుడు జయంతి సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లను లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆర్మూర్ ఆధ్వర్యంలో సన్మానించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షుడు పోల్కం వేణు, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ డికె రాజేశ్, గుజరాతి నివేదన్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడు అదృశ్యం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 13: మండలం పెంటకుర్దు గ్రామానికి చెందిన గబాళే మాదవ్ (86) అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. మాదవ్‌కు మతిస్థిమిత్తం సరిగా లేదు. ఆయన ఈనెల 11న మధ్యాహ్నం బోధన్ వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13: ఆర్మూర్ మండలం చేపూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి రెండో రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు గురువారం శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీవో సాయిరాం తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలపై అవగాహన కల్పించారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 13: డ్రంకెన్ డ్రైవ్ కేసులో బోధన్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ బోధన్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్పశాయి గురువారం తీర్పు చెప్పారు. బోధన్ పట్టణంలో పట్టణ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా నాయిబ్రాహ్మణ కాలనీకి చెందిన జి. శ్రీనివాస్ మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. గురువారం బోధన్ న్యాయస్థానంలో హాజరుపర్చగా నిందితుడికి న్యాయమూర్తి జైలుశిక్ష విధించారని పట్టణ సీఐ వెంకట నారాయణ వెల్లడించారు.

## బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి

వేల్పూర్, ఫిబ్రవరి 13: మండల కేంద్రంలో బుధవారం రాత్రి బైక్‌పై నుంచి కింద పడి ఒకరు మృతి చెందారు. ఎస్సై సంజీవ్ కథనం మేరకు.. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగారం వెంకయ్య (65) బుధవారం రాత్రి వేల్పూర్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో రైస్‌మిల్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో వాహనదారులు గుర్తించి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

రెంజల్, ఫిబ్రవరి 13: మండలంలోని కందకుర్తి గోదావరిలో ప్రమాదవశాత్తు జారి పడిన సాయిబాబా (35) మృతి దేహం లభ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ కర్రె శంకర్ గురువారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కోటగిరి మండలానికి చెందిన సాయిబాబా తన తాత మక్కయ్యతో కలిసి బుధవారం పౌర్ణమి సందర్భంగా గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు కందకుర్తికి వచ్చాడు. మొదట తాత స్నానాలు ఆచరించి ఒడ్డుకు చేరుకున్నాడు. తర్వాత నదిలో దిగిన సాయిబాబా కాలు జారి నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య సుష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మతిస్థిమితం లేక ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13: ఆలూర్ మండల కేంద్రానికి చెందిన తిర్మన్‌పల్లి ముత్తెన్న(60) గ్రామ శివారులోని కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూర్ గ్రామానికి చెందిన ముత్తెన్న కూలీ పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఆయనకు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ నెల 10న ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. గురువారం కుంటలో ముత్తెన్న మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## కుక్కల దాడిలో దూడ మృతి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13: పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇటీవల మామిడిపల్లి వెంకటేశ్వర కాలనీలో ఇద్దరు చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన కుక్కలు గురువారం దూడపై దాడి చేసి ప్రాణాలు బలిగొన్నాయి. పట్టణంలోని కోటార్మూర్‌లో గురువారం మిరడి రాజుకు చెందిన ఒక పశువుల కొట్టంపై నాలుగు కుక్కలు ఒకేసారి దాడి చేశాయి. కొట్టంలో మేత వేస్తున్న దూడపై నాలుగు కుక్కలు దాడి చేసి ప్రాణాలు తీశాయి. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను నిర్మూలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## 30 శాతం నిధులు కేటాయించాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి13: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో వారు గురువారం విద్యార్థులకు క్లాస్ టు క్లాస్ ప్రచారం నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు అనిల్ కుమార్, ఏరియా అధ్యక్షుడు నిఖిల్ మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు.